ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 24-01-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- సుపరిపాలనతో ఉత్తరప్రదేశ్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కర్ అన్నారు.
- బాలికలకు వివిధ రంగాల్లో విస్తృత అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.
- జాతీయ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వం గణతంత్ర దినోత్సవాలకు 10 వేల మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానించింది.
- వక్ఫ్ ఆస్తుల సక్రమ వినియోగమే వక్ఫ్ సవరణ బిల్లు ముఖ్య ఉద్దేశ్యమని జేపీసీ చైర్మన్ జగదాంబికా పాల్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో ఉత్తరప్రదేశ్ సుపరిపాలన రాష్ట్రంగా గుర్తింపు పొందుతోందని ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కర్ అన్నారు. ఉత్తరప్రదేశ్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి సంస్థాగత మౌలిక సదుపాయాలను నిర్మించడంలో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానంలో నిలుస్తోందన్నారు. రాష్ట్రంలోని మొత్తం 75 జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ఆ రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. గతంలో లేని అభివృద్ధి ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌లో జరుగుతోందని, రాష్ట్రం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని అన్నారు. ఉత్తరప్రదేశ్, అపూర్వమైన ప్రగతి వేగంతో నిరంతరం ముందుకు సాగుతోందని ఉప రాష్ట్రపతి వ్యాఖ్యానించారు.

(వాయిస్ బైట్.. 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బాలికలకు సాధికారత కల్పించడంతో పాటు వారికి వివిధ రంగాల్లో విస్తృత అవకాశాలను కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. భారత్‌లో బాలికలు అన్ని రంగాల్లో విజయాలను సాధించడం చూసి దేశం గర్వపడుతోందన్నారు. బాలికల హక్కులు, విద్య, సంక్షేమం లక్ష్యంగా ప్రతి సంవత్సరం జనవరి 24వ తేదీన జాతీయ బాలికా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. విద్య, సాంకేతికత, నైపుణ్యాలు, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలపై దృష్టి సారించామని, ఇవి ఆడపిల్లల సాధికారతకు దోహదపడతాయని చెప్పారు. బాలికల పట్ల ఎలాంటి వివక్ష లేకుండా చూసుకునేందుకు కృత నిశ్చయంతో ఉన్నామని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత ఆర్థికాభివృద్ధికి వస్తు ఉత్పత్తి, సేవారంగాలు రెండూ కీలకమైనవని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. ప్రపంచ ఆర్థిక ఫోరమ్ ను ఉద్దేశించి మాట్లాడుతూ.. భారత్‌లో వినియోగిస్తున్న మొబైల్ ఫోన్లలో 99 శాతం దేశీయంగానే ఉత్పత్తి అవుతున్నాయని చెప్పారు. దిగుమతులకు ప్రత్యామ్నాయంపై దృష్టి సారించే స్థితి నుండి మేక్ ఇన్ ఇండియా మేక్ ఫర్ ద వరల్డ్ అనే స్థితికి పరివర్తన చెందామని పేర్కొన్నారు. భారత్‌లో ఫార్మాస్యూటికల్స్, కెమికల్స్, గార్మెంట్స్ వంటి రంగాలు ఎగుమతి ఆధారంగా అభివృద్ధి చెందాయన్నారు. సెమీకండక్టర్, కృత్రిమ మేధ రంగాలలో భారత్ దినదినాభివృద్ధిని సాధిస్తోందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

(వాయిస్ బైట్.. 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించే ప్రయత్నాల్లో భాగంగా, ఈ నెల 26వ తేదీన న్యూఢిల్లీలో జరిగే 76వ గణతంత్ర దినోత్సవ పరేడ్‌ను వీక్షించేందుకు దాదాపు 10 వేల మంది ప్రత్యేక అతిథులను ఆహ్వానించారు. ఈ ఆహ్వానితుల్లో ప్రమాదాల నివారణ, విపత్తు సహాయం AAPDA మిత్ర వాలంటీర్లు, ASHA వర్కర్లు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, PM కిసాన్ సమ్మాన్ నిధి లబ్ధిదారులు, మై భారత్ వాలంటీర్లు ఉన్నారు. వాలంటీర్లు, వివిధ పథకాల లబ్ధిదారుల ప్రజాసేవ, సహకారాలను గుర్తించి, గౌరవించే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం వీరిని ఆహ్వానించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వక్ఫ్ సవరణ బిల్లు గురించి ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఈ బిల్లుపై ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ చైర్మన్ జగదాంబికా పాల్ స్పష్టం చేశారు. వక్ఫ్ సవరణ బిల్లు అంశంపై ఆయన ఈరోజు మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు మతపరమైన సంస్థ కాదని, మతపరమైన స్థలాన్ని ఎవరి నుండి బలవంతంగా తీసుకోవడం జరగదని పేర్కొన్నారు. తమ మతానికి చెందిన మత స్థలాలను కోల్పోతారనే అపోహలను ముస్లిం సమాజం నమ్మవద్దన్నారు. వక్ఫ్ ఆస్తులు దుర్వినియోగం కాకుండా జేపిసి కమిటీ ఏర్పాటుకు దారితీసిందని వివరించారు. పేదలు, ముస్లింల ప్రయోజనాల కోసం ఈ ఆస్తులను సక్రమంగా ఉపయోగించుకునేలా చూడడమే ఈ చట్టం ఉద్దేశ్యమని ఆయన తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈ నెల 29వ తేదీన మౌని అమావాస్య సందర్భంగా కుంభమేళాకు భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఆ ఒక్క రోజే దేశవిదేశాల నుండి సుమారు 10 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రయాగ్‌రాజ్ పరిసర ప్రాంతాల్లో అందుకు తగినట్టుగా ఏర్పాట్లు చేస్తోంది. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకుగాను 12 కిలోమీటర్ల పొడవైన ఘాట్‌లను ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. అలాగే.. వాహనాల రద్దీని నియంత్రించడం, భక్తులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు అదనపు సిబ్బందిని మోహరించనున్నామని చెప్పారు. మౌని అమావాస్య రోజున వీఐపీ జోన్ ఉండదని, ప్రముఖులకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండవని అధికారులు తెలియజేశారు. అలాగే.. ప్రయాగ్‌రాజ్ డివిజన్ పరిధిలోని అన్ని రైల్వే స్టేషన్‌లలో భక్తులకు వైద్య సేవలు అందించేందుకు భారతీయ రైల్వే పటిష్ట ఏర్పాట్లు చేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వక్ఫ్ సవరణ బిల్లు 2024పై ఈరోజు జరిగిన పార్లమెంట్ జాయింట్ కమిటీ సమావేశం నుండి 10 మంది ప్రతిపక్ష పార్లమెంట్ సభ్యులు సస్పెండ్ అయ్యారు. టీఎంసీకి చెందిన కళ్యాణ్ బెనర్జీ, డీఎంకేకు చెందిన ఏ.రాజా, కాంగ్రెస్ ఎంపీలు నాసిర్ హుస్సేన్, ఇమ్రాన్ మసూద్, సమాజ్ వాదీ పార్టీకి చెందిన మొహిబుల్లా సస్పెండ్ అయిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా ప్యానెల్ చైర్మన్ జగదాంబికా పాల్‌పై, కళ్యాణ్ బెనర్జీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని బీజేపీ ఎంపీ అపరాజిత సారంగి ఆరోపించారు. ఇక ఈ అంశంపై జగదాంబికా పాల్ స్పందిస్తూ..

(వాయిస్ బైట్..32 సెకన్లు)

కాగా.. జేపీసీలో లోక్‌సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది సభ్యులు ఉన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆదాయపు పన్ను చట్టంలో TDS విధానాన్ని రద్దు చేయాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం PIL ను సుప్రీంకోర్టు ఈరోజు తిరస్కరించింది. TDS విధానం ఏకపక్షంగాను అహేతుకంగాను ఉందని, ఇది సమానత్వ హక్కుతో సహా అనేక ప్రాథమిక హక్కులను ఉల్లంఘించిందని పిటిషనర్ తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. కాగా... ఈ పిటిషన్‌ను పేలవంగా రూపొందించినట్టు పేర్కొంటూ.. సుప్రీం కోర్టుకు బదులుగా హైకోర్టును ఆశ్రయించాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం పిటిషనర్‌కు సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర పట్టణ వ్యవహారాలు, విద్యుత్ శాఖా మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తెలంగాణ రాష్ట్రం కరీంనగర్‌లో 24 గంటల నీటి సరఫరా ప్రాజెక్టును ఈరోజు ప్రారంభించారు. 24 గంటలు తాగునీటిని సరఫరా చేసే ఈ ప్రాజెక్ట్ మొట్టమొదటిది కావడం విశేషం. కరీంనగర్‌లోని 5 డివిజన్లలో ప్రారంభించిన పైలట్ ప్రాజెక్టును 18 కోట్ల రూపాయలతో చేపట్టారు. దాదాపు 6 వేల నీటి కనెక్షన్ల ద్వారా 24 గంటల పాటు తాగునీటిని అందించనున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =